తాను చేసుకున్న సుకృతం పూర్తయినదాకా జీవుడీ లోకంలో వుంటాడు. చాలా తక్కువగా పుణ్యం చేసినవాళ్ళు భువర్లోకంలో కొంచెం క్రింద పిశాచ లోకంలో నివసిస్తారు.

వీరి శరీరాలు ప్రేత శరీరాలు కావుగానీ సౌందర్యవంతమైన దివ్యశరీరాలు కూడా కావు. జుంజోరు వెంట్రుకలతో, బండి కందెన చాయ కాయములతో, గచ్చకాయలవంటి కనుగ్రుడ్లతో, గాడిద గొంతుల వంటి వికృత కంఠస్వరములతో ఉంటూ కర్మానురూపమైన ఫలితములను అనుభవిస్తారు.

అత్యుత్తమమైన పుణ్యకార్యాలు చేసినవారు, మహాతపస్సు చేసిన వారు భువర్లోకం దాటి పైకి వెళ్ళిపోతారు.

అందుచేత అన్ని జన్మలకంటే అత్యుత్తమమైన మానవజన్మలో ప్రతి జీవి సత్ప్రవర్తనుడై ఉండాలి. భూరి విరాళము లివ్వనవసరం లేదు. తనకు తోచినంత లేనివారికి దానం చేయాలి.

మనస్సు, వాక్కు, కర్మలపరంగా శుద్ధిమంతుడైతే అతను చేసుకున్న పుణ్యం వెయ్యింతలై అతని మరణానంతరం మంచి లోకాలకు తరలిపోగలడు.

మానవజీవితం క్షణభంగురమైనది. ఆ తరువాత జీవితమే సుదీర్ఘ మైనది. ఇది తెలియని అమాయకులు కామ, క్రోధ, మద మాత్సర్యాదులై ప్రవర్తించి వందల వందల సంవత్సరాలు పై లోకాల్లో దుర్భరమైన బాధలు అనుభవిస్తారు' అని వివరించాడతను నాకు" అంటూ ఆగాడు వరప్రసాదం.

అతను చెబుతున్న ఒక్కొక్క విశేషం అభిరాంని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతున్నాయి, నిశ్శబ్దంగా వున్న ఆ గదిలో వాల్‌క్లాక్ చేస్తున్న ధ్వని తప్ప దాదాపు శబ్దరహితంగా వుంది.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు వరప్రసాదం.

"టిబెట్ హిమాలయాలలో నేను చూసిన అద్భుతమైనదీ, అపూర్వమయినదీ ఓ వృద్ధ బౌద్ధ భిక్షువు యోగప్రక్రియ ద్వారా శరీరాన్ని విడిచి పైలోకాలకు పయనించడం. అంటే మరణించడం. ఆ సంఘటన తిలకించడం నా జీవితంలో మర్చిపోలేను. దీనికి నాకు సహాయపడినది ఓ టిబెటన్ లామా.

టిబెటన్ హిమాలయాల పరిసరాలలో తిరుగుతున్న నాకు, అతను తారసపడి, నా గురించి వివరాలు అడిగాడు. అప్పటివరకూ నేను చూసిన చిత్రాలు, విచిత్రాలు చెప్పానతడికి. నాలోని జిజ్ఞాస గమనించి-

"అయితే నీకు యిప్పటిదాకా గోచరించని మహాద్భుతాన్ని చూపుతాను. నాతో రా" అని తన వెంట నన్ను తీసుకువెళ్ళాడు.

"అది మంచుకొండలపైన నెలకొని వున్న టిబెట్ పీఠభూమిలోని ఒకానొక యోగుల ఆశ్రమం. మేం ఆశ్రమంలోనికి ప్రవేశించేసరికి గుండ్రంగా కూర్చున్న టిబెటన్ లామాలు మరణిస్తున్న ఒక జీవికి ఆఖరి క్షణాల్లో జరిపే యోగ ప్రక్రియ నిర్వహిస్తున్నారు.

శతాబ్దాలుగా యోగప్రక్రియల్లో సిద్ధహస్తులైన 'పరమ గురువులు' రూపొందించిన కార్యక్రమమది. అది 'బ్రహ్మయజ్ఞం' లేక 'ఉత్తర ప్రక్రియ'.

తుమ్మెద నాదంలాంటి శబ్దం 'ఝుమ్మ'ంటూ లయబద్ధంగా ప్రతిధ్వనిస్తోంది ఆ గుహలో. అగరువత్తుల పొగ పైకి లేస్తూ ఆ పవిత్ర వాతావరణాన్ని మరింత తన్మయత్వంలోకి తీసుకెళుతోంది.

ఆ మధ్యలో ఒక వృద్ధుడైన బౌద్ధ భిక్షువు తల ఒక వంక వెనక్కి వాల్చి, నిశ్శబ్దంగా పడివున్నాడు. అతని ప్రాణం పోలేదనటానికి నిదర్శనంగా అతని ఉచ్ఛ్వాస, నిశ్వాసలు కొనసాగుతున్నాయి.

అప్పుడు నాకో రక్షాబంధనం వంటి తాయెత్తు యిచ్చాడు నన్నా ప్రదేశంలోనికి తీసుకెళ్ళినతను. నేను దాన్నేం చేయాలో తోచక అతని వంక చూశాను. అతను మాట్లాడవద్దన్నట్లు సైగచేసి, దాన్ని చేతికి కట్టుకోమన్నట్టు సైగచేశాడు.

నేను మౌనంగా అతను చెప్పినట్లే చేశాను.

అద్భుతం ..... పరమాద్భుతమైన దృశ్యం తిలకించగలిగాను ఆ రక్షాబంధనం కట్టుకోగానే.

అంతిమ ఘడియల్లో వున్న బౌద్ధభిక్షువు ఆత్మ టెంకాయ పగలకుండానే చిప్పనుంచి విడిపోయే 'కురిడీ' వలె క్రమక్రమంగా అతని శరీరంనుంచి విడుదల కాసాగింది. అతనా రక్షాబంధనం ఎందుకిచ్చాడో అప్పుడర్థమైంది నాకు.

అంతటి మహోన్నత దృశ్యం తిలకించాలంటే ఎంతటి యోగశక్తి వుండాలో, ఇంకెంతటి ఋషిత్వం పొందాలో, అటువంటివారే అలాంటి మహాద్భుత దృశ్యాన్ని లకించగలరు.

నాలాంటి మామూలువాడికి అది సాధ్యపడే పని కాదుకాబట్టే నాకతడు ఆ రక్షాబంధనం వంటి తాయెత్తిచ్చాడని తెలుసుకుని అతనివైపు భక్తిగా, వినయంగా చూసి నమస్కరించాను. అతడు మౌనంగా తలూపి జరగబోయేది చూడమన్నట్టు సైగ చేశాడు. నేను అతను చెప్పినట్లే చేశాను.

మరణించేవారి ఆత్మకు భయమూ, దిగులూ, బాధా లేకుండా నిండార ముగ్గిన మామిడి పండులోంచి టెంక తేలికగా జారివచ్చినట్టు శరీరంలోంచి జీవాత్మ వెలువడే విధానం అది.

పాదాల దగ్గరనుంచి మొదలై, బొటనవేలుకి పక్కనే వున్న పొడుగాటి రెండవ వేలు నుంచి స్థూల శరీరంలోంచి సూక్ష్మశరీరం క్రమంగా వూడివచ్చి చీలమండలూ, మోకాళ్ళూ, తొడలు, నాభివరకూ బయటికి రాగానే పొగమంచులా గాలిలో శరీరానికి రెండడుగుల ఎత్తున తేలుతూ వున్నది 'జీవుడు'.

ఒక సెకండు బొడ్డు దగ్గర పొడుగాటి టెలిఫోను తీగవంటి ఒక గొట్టము మరణిస్తున్న అతని శరీరానికీ, జీవాత్మకూ అనుసంధానంగా, లేత నీలపు కాంతితో వెలుగుతూ ఆరుతూ శరీరంలోని జీవుణ్ని బయటకు లాగసాగింది.

ఉన్నట్టుండి ఆ వృద్ధభిక్షువు నడుం దగ్గర నుంచి పైకి లేచాడు. లేత నీలపుకాంతి అక్కడ బలంగా లాగసాగింది. అదీ కొన్ని క్షణాలు మాత్రమే. తరువాత పైకి లేచిన అతని నడుం ఎవరో వదిలేసినట్లే దబ్బుమని విడివడి క్రిందపడటం జరిగింది.

ఆ క్షణంలోనే ఏదో గాలిపటం తెగినట్లు, మగత నిద్రలో పిల్లలు చేసే మూలుగువంటి చిన్న శబ్దంతో జీవాత్మ పూర్తిగా ఆ వృద్ధ భిక్షువు శరీరం నుంచి బయటికి వచ్చేసింది. మరుక్షణం అది తుఫాను వేగంతో శూన్యంలో కలసిపోవడం స్పష్టంగా కన్పించింది ..... " అంటూ ఆగాడు వరప్రసాదం.

అదే సమయంలో రాత్రి పన్నెండయినట్లు వాల్‌క్లాక్ పన్నెండు గంటలు కొట్టింది.

"తరువాతేమైంది?" సస్పెన్స్ భరించలేనట్లు అడిగాడు అభిరాం.

"నన్నక్కడికి తీసుకెళ్ళిన లామా నా చేతికున్న రక్షా బంధనం తిరిగి తీసుకుని బయటికి నడిచాడు. నేనూ అతన్ని అనుసరించాను. అతను ఆ గుహనుంచి కాస్త దూరం నడిచి ఓ మంచుకొండపై కూర్చున్నాడు. నేనతనికి దిగువగా వున్న మరో బండపై కూర్చున్నాను. అప్పుడు సూర్యాస్తమయమవుతోంది.

మంచు కరిగి నీరై ప్రవహిస్తూ చిన్న చిన్న అలలు ఒకదానికొకటి ఢీకొంటూ ప్రేయసీ ప్రియులు ముచ్చట్లాడుకుంటున్నట్లున్నాయి. కొండలపై నుండి జాలువారే నదులు, కాలువలు కేశ పాశాల్లా వున్నాయి. వాటి సంగీతం సుమధురంగా, అద్భుతంగా వుంది. నీరెండలో పొగ మంచు హిమాలయాలంతటినీ ఆక్రమించుకున్న వెన్నెల పరుపులా వుంది.

చాలాసేపు ఆ లామా మౌనంగా వుండిపోయాడు. అతని మౌనానికి నేను భంగం కలిగించదలచుకోలేదు. హిమాలయాల్లో యోగులూ, ఋషులూ మౌనంగా వున్నప్పుడు వారికి అంతరాయం కలిగించకూడదని అప్పటికే తెలుసుకున్నాను నేను.

మన మదిలో మెదిలే భావాలూ, అనుభవాలూ, ప్రశ్నలూ వాయు తరంగాల్లో కలసిపోయి వారి బుద్ధిని చేరుకుని వాటికి సమాధానాలు వారే చెబుతారు. దానికి మనం కొంచెం ఓపికపట్టాలి. నా నిరీక్షణ ఫలించింది. నేను అడగాలనుకున్న ప్రశ్నలకి ఆ లామానే జవాబులు చెప్పసాగాడు.

"ఇపుడు నువ్వు చూసింది ఆత్మ వీడి అనంత శూన్యంలో కలసిపోయే అద్భుత దృశ్యాన్ని. ఇది తిలకించాలంటే ఎంతో సాధన అవసరం. నువ్వు అదృష్టవంతుడివి."

ఏ కష్టమూ లేకుండానే ఆ దృశ్యాన్ని తిలకించావు. అయితే నీకు పైపై దృశ్యాలే కనిపించాయి.

శరీరంలోంచి జీవాత్మ పోయేటపుడు ఆ జీవుడికి ఎదురయ్యే అనుభవాలు నీకు తెలియదు. ఎందుకంటే నీవింకా మరణించలేదు. కానీ యోగులకు, ఋషులకు మరణించకనే ఆ అనుభవాలు తెలుస్తాయి.

శరీరంలోంచి ఆత్మ బయటకు పోయేటప్పుడు నాభి దాకా జ్ఞాపక శక్తి పనిచేస్తూ

వుంటుంది. క్రమంగా శిరస్సులోంచి క్రిందిభాగం వైపుకు వెచ్చగా, సముద్రపు ఆటుపోటుల్లా ఆ వెచ్చదనం ప్రవహిస్తూ తర్వాత హృదయం వైపుకు పాకి ఆగిపోతుంది.

మిగతా శరీరం చల్లబడి మట్టిముద్దలా బరువెక్కడం, ఆ బరువు నడుం దగ్గరకు చేరుకోవడం, ఆత్మ శరీరాన్ని విడిచిపోవటం జరుగుతుంది. అందుకే ఇందాక మరణించిన లామా (బౌద్ధ భిక్షువు) నడుం గాలిలోకి లేచి ఒక్కసారిగా నేలపైబడింది.

శరీరంలోంచి బయటపడిన ఆత్మ అనంతాకాశంలోకి పయనిస్తుంది. అక్కడి చీకటి వెలుతురు లేని చోట ఏర్పడే అంధకారంవంటిది కాదు. స్పర్శకి తగిలే చిక్కదనం నిండిన చీకటి.

ఇది ప్రేతలోకాల మార్గంలోకి ప్రవేశిస్తున్న జాడ. సుడిగుండంలా గుండ్రంగా ఒక గొట్టంలో వేగంగా ప్రవహించే నీటిలా జీవుణ్ని గిరగిరా తిప్పుతూ ముందుకు తోసుకుపోతుంది ఒక తుఫాను వంటి నిశ్శబ్దమైన వేగం. ఆ జీవుడి ప్రయత్నమేమీ లేకుండానే ఏటవాలుగా కాళ్ళు ఎత్తుగా, తల దిగువగా వంగి గాలిలోకి, నల్లటి సొరంగంలోకి శరవేగంతో దూసుకుపోతున్న అనుభూతికి లోనవుతాడు.

అలా అలా కాంతి వేగంతో సమానమైన వేగంతో ప్రయాణంచేసి క్రమక్రమంగా నక్షత్రంలాగా, మరుక్షణలో చీకటి నిండిన రంధ్రంద్వారా ప్రయాణించి కొంతసేపటికి ఒక సన్నటి వెలుగుకిరణంలాగ విశాల ప్రపంచంలోకి విసిరేయబడిన అనుభూతికి లోనవుతాడు జీవుడు. మరుక్షణమే కాళ్ళు దిగువకీ, తల పైకి లేచి శరీరం నిటారుగా నిలబడి చుట్టూ పరిసరాల్ని గమనించగలుగుతాడు.

వెనుదిరిగి చూస్తే పక్కమీద వున్నది తన రూపమే అని తెలుసుకుని స్పష్టంగా చూసుకుంటాడు. చాలామందికి జీవిత కాలంలోకంటే మరణం తరువాత తమని తాము స్పష్టంగా మొదటిసారి చూసుకోవటం జరుగుతుంది. చాలామంది ఆ చూస్తున్నది తమ శరీరాన్నే అని గుర్తించరు. ఎవరినో బైట వ్యక్తిని చూస్తున్నట్లు ఆశ్చర్యంగా చూస్తారు.

మరుక్షణమే వెలుగు! లేత వెన్నెలలా సంధ్య వెలుగులా మెరుస్తూ వింతగా కన్పిస్తుంది. తాను మరణించానని జీవి తెలుసుకుని  తాను ఒంటరిననీ, ఇక్కడ తనకి నా అన్నవారు వుండరని దిగులుతో స్తంభించి ఉండగానే కాంతిని మించిన వేగంతో రెండు ఆకారాలు ప్రత్యక్షమవుతాయి.

వారు మరణించేసరికి సహాయంచేసే 'కర్మదేవతలు' మరణించిన వారి మత విశ్వాసాలను బట్టి కొందరికి క్రైస్తవ ఫాదరీలలా, మరికొందరికి చేతిలో జపమాల తిప్పుతున్న బౌద్ధ భిక్షువుల్లా, ఇంకొందరికి ఋషీశ్వరుల్లా కన్పిస్తారు.

ఇప్పుడు మరణించిన ఒక వ్యక్తి యోగి! టిబెటన్ లామా! అతడిని ఒక పనిమీద ఈ భూమ్మీంచి ఒక అసాధారణ పరిశోధనకై పంపించారు' అతను చెప్పిన మాటలతో నేను షాక్ తిన్నాను.

అప్పుడతను చిన్నగా నవ్వి- 'అలా ఆశ్చర్యపోకు. ఇది సత్యమే. మరణించి తిరిగి జన్మించటం అంటే చాలాకాలం పడుతుంది. వెంటనే తగినటువంటి తల్లిదండ్రులు దొరకటం కష్టం.

ఒకవేళ మంచి జన్మ లభించినా బాల్యంనుంచి పెరిగి పెద్దవాడవటంలో అతడు భూమ్మీద చేయవలసిన కార్యం వెనుకబడిపోతుంది.

అందుకని మరణించబోతున్న వేరే వ్యక్తి శరీరంలోకి ఈ యోగి ఆత్మను 'పరకాయ ప్రవేశ విద్య' ద్వారా పంపించి, అతడిని ఓ బ్రిటీష్ వాని శరీరంలో నివసించే ఏర్పాటు చేయవలసి వచ్చింది.

ఈ యోగి ఆత్మ బ్రిటీష్‌వాడు మరణించిన మరుక్షణం తుమ్మెదల నాదంలాగ, సముద్రపు హోరులాగా, సన్నని కీచురాయిలా విన్పిస్తున్న శబ్దాల మధ్యనుంచి పయనించి కళ్ళు నల్లగా చీకట్లు కమ్మి, శ్వాస గొంతులో గురగురలాడుతుండగా, ఉన్నట్టుండి ప్రాణాలు చచ్చుబడ్డట్టు నీరసంతో ఉన్నపుడు తానెవరి శరీరంలోకి వెళ్ళాలో ఆ శరీరం బొడ్డు దగ్గరకు చేరి కరెంటులా అదాట్టుగా ఆ శరీరంలోకి వెళ్ళిపడతాడు.

దాంతో మరణించిన ఆ బ్రిటీష్‌వాడు మరలా ఊపిరి పీలుస్తాడు. వైద్యులు తమ పేషెంటు గుండె ఆగిపోయి కొన్ని నిముషాలు 'మెడికల్'గా మరణించి, తిరిగి తాము అతని గుండెలను నొక్కి, మాలీషు చేయడంవల్లే శ్వాసక్రియ అందుకొని బ్రతికాడని తమ వైద్య నివేదికలో రాసుకుంటారు.

వారికి తెలిసిందే సర్వస్వం  అనుకుంటారు. వాళ్ళ దృష్టిపథంలోకి రానివి, లేవని కొట్టిపడేస్తారు' అంటూ ముగించాడు ఆ లామా. నేను ఊపిరి సైతం పీల్చడం మర్చి విన్నాను" అన్నాడు వరప్రసాదం.

(వృద్ధ బౌద్ధభిక్షువు మరణించి తిరిగి ఓ బ్రిటీష్‌వాని శరీరంలోకి పరకాయ ప్రవేశం ద్వారా ప్రవేశించడం Dr. From Lhasa, The Rampa story అనే రెండు గ్రంథాల్లో లోబ్‌సాంగ్ రాంపా అన్న పేరు గల వ్యక్తి  తన పరకాయ ప్రవేశం అనుభవాన్ని యథాతథంగా వివరంగా విపులీకరించి రాసాడు.)

"ప్రస్తుతం నాదీ అదే పరిస్థితి" అన్నాడు అభిరాం- తనున్న స్థితేమిటో తనకే తెలీక.

రాత్రి ఒంటిగంటయినట్లు గడియారం ఓసారి మోగింది. "ఇక పడుకుందాం" అన్నాడు వరప్రసాదం.

"సరే" అని లైటాపేసి బెడ్‌ల్యాంప్ వెలిగించాడు అభిరాం. ఇద్దరూ నిద్రకుపక్రమించారు.

*     *     *     *     *